నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 15 డిసెంబర్ 2024 | MEDAK

మార్పు అంటే హామీలు విస్మరించడమా

గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 14: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ధర్నాలు, రాస్తారోకోలు, సమ్మెలతో దద్దరిల్లుతున్నదని, ఇదేనా కాంగ్రెస్ తీసుకువచ్చిన మార్పు అని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల నిరవధిక దీక్షలకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను విస్మరించిందన్నారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను సైతం సీఎం రేవంత్ విస్మరించారని, వారికి సమాన పనికి సమాన వేతనంతో పాటు క్రమబద్ధీకరణ హామీని వెంటనే అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయలేని పక్షంలో సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీ తాగినంత సమయంలో మీ సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నిలకప్పుడు చెప్పిన రేవంత్, గద్దెనెక్కాక మాట తప్పాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ తరపున సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు లేవనెత్తుతానని ప్రకటించాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, కరుణాకర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గ్రూప్-2 పరీక్షలు

- సంగారెడ్డి జిల్లాలో 41 పరీక్షా కేంద్రాలు
- అరగంట ముందే సెంటర్లకు అనుమతి

సంగారెడ్డిలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న సిబ్బంది

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 14: సంగారెడ్డి జిల్లాలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆది,సోమవారం జరిగే గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సమీక్షించారు. ఈ పరీక్షలు ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహిస్తారు. జిల్లాలో 41 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 15,218 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానుండగా, ఆదివారం (నేడు) ఉదయం 10 నుంచి మధ్యాహం 12.30 గంటల వరకు పేపర్-1, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుంది. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహం 12.30 గంటల వరకు పేపర్-3, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్ -4 పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులకు అవసరమైన వసతులను పరీక్షా కేంద్రాల్లో కల్పించామని, దివ్యాంగ అభ్యర్థుల కోసం వీల్ చైర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా సమయానికి అరగంట ముందే గేట్లు మూసివేయనున్నట్టు కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు నలుపు లేదా నీలం బాల్ పాయింట్ పెన్ను, పెన్సిల్, ఎరేజర్, హాల్ టికెట్‌పై ఫొటో అతికించుకుని, ప్రభుత్వం జారీచేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటోఐడీతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే రాయాలని, పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఏఎన్ఎంలు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచామని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో వైద్యారోగ్య సేవలు

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 14: గ్రూప్ -2 పరీక్షా కేంద్రాల వద్ద వైద్యారోగ్య శాఖ సిబ్బంది ద్వారా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్ తెలిపారు. ఆది, సోమవారాల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్ష కేంద్రాల్లో (ఫస్ట్ ఎయిడ్ కిట్స్) వైద్యారోగ్య శాఖ అత్యవసర మందులతో 37 పరీక్ష కేంద్రాల్లో ఉన్నారని, ఎలాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

సంగారెడ్డి జిల్లా హద్నూర్‌లో చలి మంట కాచుకుంటున్న గ్రామస్తులు

వణికిస్తున్న చలి

జహీరాబాద్, డిసెంబర్ 14: సంగారెడ్డి జిల్లాను చలి వణికిస్తున్నది. ప్రధానంగా జహీరాబాద్ నియోజవర్గంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల కారణంగా శనివారం జహీరాబాద్ నియోజకవర్గంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. న్యాల్‌కల్‌లో 9.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత కోహీర్‌లో 10.4 డిగ్రీలు, జహీరాబాద్ మండలం అల్గోల్, మల్చాల్మాలో 11.6, సత్వార్‌లో 11.7, మొగుడంపల్లిలో 12,0, ఝరాసంగంలో 12.8, జహీరాబాద్ 13.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 5 గంటల నుంచి 8 వరకు పొగమంచు కురుస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. వాహనదారులు హెడ్‌లైట్ల వెలుగుల్లో వాహనాలు నడుపుతున్నారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు, చిరువ్యాపారులు, బల్దియా, పంచాయతీ కార్మికులు చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలితో జనం త్వరగా ఇంటికి చేరుకుంటుండడంతో రాత్రివేళ 7.30 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. చలి నుంచి రక్షణకు ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. చలిమంట కాచుకుంటున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రిమ్మనగూడ-బూరుగుపల్లి మధ్య రోడ్డు పక్కన సైడ్‌వాల్ లేక ప్రమాదకరంగా రోడ్డు

గజ్వేల్, డిసెంబర్ 14: రోడ్డు బాగు చేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన అధికారులు, రోడ్డుకు ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని గమ్యస్థానాలకు చేరుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడ-బూరుగుపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. కొడకండ్ల నుంచి క్యాసారం వైళ్లే కాళేశ్వరం కాలువ వద్ద వేసిన సీసీ రోడ్డు బీటలు వారింది. కాలువ సమీపంలోనే వాగు ఉండడంతో గతంలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. కాలువ నుంచి వాగు బ్రిడ్జి వరకు సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు భయంతో ప్రయాణించాల్సి వస్తున్నది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయానికి గురవుతున్నారు. రోడ్డుపై నుంచి కిందపడితే ఇక అంతే. కాలువ పైనుంచి కింది వరకు వేసిన సీసీ రోడ్డు మధ్యలో భారీ పగుళ్లు ఏర్పడ్డాయి.

రిమ్మనగూడ-బూరుగుపల్లి బ్రిడ్జి సమీపంలోని రోడ్డు మధ్యలో భారీ పగుళ్లు

రిమ్మనగూడ రాజీవ్ రహదారి నుంచి ఇదే మార్గంలో బూరుగుపల్లి, దాచారం, సింగాటం, అనంతరావుపల్లి, తిప్పారం గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ ప్రాంతాలకు ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

విలీనం వద్దే వద్దు

మా ఊరు మాకు ముద్దు..

విలీన పంచాయతీల్లో విప్లవం

నిర్ణయం మారకుంటే మరో ఉద్యమం తప్పదని సర్కారుకు హెచ్చరిక

- మున్సిపాలిటీల్లో 51 గ్రామాల విలీనం
- హడావిడిగా ఆర్డినెన్స్ జారీతో వివాదాలు
- పట్టణీకరణ పేరుతో భారీగా ఆర్థికభారం
- విలీనాన్ని వ్యతిరేకిస్తున్న పల్లె ప్రజలు

సంగారెడ్డి, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ పటాన్‌చెరు/ అమీన్‌పూర్, డిసెంబర్ 14: ఒక చారిత్రక తప్పిదం.. ఒక విలీనం.. 60 ఏండ్ల గోసకు కారణమైంది. కొట్లాడి తెచ్చుకుంటే స్వేచ్ఛావాయువులు లభించాయి. ఇప్పుడు గ్రేటర్‌లో మరో విలీనం కలకలం రేపుతున్నది. మరో విప్లవానికి శ్రీకారం చుడుతున్నది. కత్తి పక్కోడిది అయినా పొడిచేది మనోడే అన్నట్టు.. కాంగ్రెస్ సర్కారు పల్లెవాసులపై కత్తి కట్టింది. భారీ కుట్రలకు తెరలేపింది. సాధారణ పల్లెవాసులు ఈ విలీనం వద్దే వద్దు.. మా గ్రామమే మాకు ముద్దు అని మొత్తుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో హడావిడిగా ఆర్డినెన్స్ జారీ చేసింది. హైదరాబాద్ చుట్టుపక్కల విస్తరించి ఉన్న ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అక్కడితో ఆగకుండా పక్కావ్యూహంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి తీసుకువచ్చే ప్రణాళికలను గుట్టుచప్పుడు కాకుండా అమలు చేస్తున్నది. ప్రభుత్వ మొండి వైఖరిపై పల్లెల్లో మరో ఉద్యమం ఊపందుకుంటున్నది. సర్కారు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మరో విప్లవాన్ని సృష్టిస్తామని విలీన గ్రామల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

గ్రామాల విలీనానికి లైన్ క్లియర్

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడం అనివార్యంగా మారింది. విలీనంపై కాంగ్రెస్ సర్కార్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గతంలో విలీన ప్రక్రియను చేపడుతూ విడుదల చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ పలు గ్రామాల ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. అయితే సర్కారు తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారమే విలీన ప్రక్రియ సాగుతుందన్న ప్రభుత్వ వాదనలకు హైకోర్టు ఆమోదం తెలిపింది. దీంతో విలీనంపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడంతో... విలీన ప్రక్రియ అనివార్యంగా మారింది. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ పలువురు కోర్టును ఆశ్రయించినా... పిటిషన్లను సీజే ధర్మాసనం కొట్టి వేయడంతో విలీన ప్రక్రియపై ప్రభుత్వం మరింత దూకుడు పెంచనున్నది.

రచ్చబండల వద్ద చర్చ

రేవంత్ ప్రభుత్వం తీసుకున్న 51 గ్రామాల విలీన ప్రక్రియ పెద్దఎత్తున విమర్శలకు తావిస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో 12, మేడ్చల్ జిల్లాలో 28, సంగారెడ్డి జిల్లాలో 11 గ్రామాలు 13 మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయి. గ్రామాలను విలీనం చేసే విషయంలో గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా 2నెలల వ్యవధిలోనే ఒక సంస్థ అభిప్రాయం, అధికారులతో కమిటీ వేసి, ఆ తర్వాత క్యాబినెట్ సబ్ కమిటీ వేసి వారి అభిప్రాయం ద్వారానే విలీన ప్రక్రియ హడావిడిగా చేశారనే విమర్శలు ఉన్నాయి.విలీనమైతే భూముల ధర పెరగడం మాటేమోకానీ, విలీన గ్రామాలను హైడ్రా పరిధిలోకి తీసుకురావడంతో రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందోనన్న భయం గ్రామస్తులను వెంటాడుతున్నది. పన్నుల భారం, కోల్పోనున్న పచ్చదనం, అధికారులను కలిసే అవకాశమేలేని పాలనా అసౌకర్యం, రాజకీయ నిరుద్యోగం, పర్మిషన్లు కావాలన్నా.. ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా తప్పని ఆర్థికభారం.. ఇవన్నీ ప్రస్తుతం రచ్చబండల వద్ద చర్చకు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పల్లెకోసం కదం తొక్కుతున్నారు. గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు.

అంతా హడావిడే..

గ్రేటర్ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించే ప్రణాళికతో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలను విలీనం చేయాలని సర్కారు సంకల్పించింది. అస్కీకి విలీన ప్రక్రియపై అధ్యయనం చేసే బాధ్యత అప్పగించింది. మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, మల్కాజ్‌గిరి కలెక్టర్లతో మరో కమిటీ వేసింది. ఈ రెండు కమిటీలు ఓఆర్ఆర్ చుట్టుపక్కల ఉన్న 45 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయొచ్చని సూచించింది. ఆగస్టు 1న క్యాబినెట్ సబ్‌కమిటీ వేయగా ఆగస్ట్ 22న వారు నివేదిక ఇస్తూ 45 గ్రామాలకు మరో 6 గ్రామాలు కలుపాలని సూచించింది. మున్సిపల్ చట్టం 2019కి సవరణలు చేస్తూ, సెప్టెంబర్ 3న 51గ్రామాల విలీనానికి ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. గవర్నర్‌తో ఆమోదముద్ర వేయించారు. తమతో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే హడావిడిగా ఈ ప్రక్రియ చేపట్టడంపై మెజార్టీ గ్రామాల్లో వ్యతిరేకత పెల్లుబికుతున్నది. ఈ విలీన ప్రక్రియ వెనుక పూర్తిగా కుట్రకోణం దాగి ఉందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఈ విషయంపై శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ధర్నాలు చేశారు. తమకు తెలియకుండానే గ్రామపంచాయతీ కార్యదర్శి విలీనంపై దొంగ సంతకాలు చేశారని ఆరోపిస్తున్నారు. ఇక కొన్ని గ్రామాలు విలీనమే వద్దని ఏకగ్రీవంగా తీర్మానాలూ చేస్తున్నాయి.

మున్సిపాలిటీల్లో విలీనమైన మొత్తం గ్రామాలు : 51

రంగారెడ్డి జిల్లా - 11	మేడ్చల్ జిల్లా - 29	సంగారెడ్డి జిల్లా - 11

విలీన గ్రామాలు ఇవే..

జిల్లా	మున్సిపాలిటీ	విలీన గ్రామాలు
రంగారెడ్డి	పెద్ద అంబర్‌పేట	బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట
	శంషాబాద్	బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాన్సీమియగూడ
	నార్సింగి	మీర్జాగూడ
మేడ్చల్	తుక్కుగూడ	హర్షగూడ
	మేడ్చల్	పూడూర్, రాయిలాపూర్
	దమ్మాయిగూడ	కీసర, యాదగిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి
	నాగారం	భోగారం, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లిదాయర
	పోచారం	వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ
	ఘట్‌కేసర్	అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్వల్లిగూడ
	గుండ్లపోచంపల్లి	మునీరాబాద్, గౌడవెల్లి
	తూంకుంట	బొంరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ
సంగారెడ్డి	అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్
	తెల్లాపూర్	పోచారం, ముత్తంగి, కర్దనూర్, పాటి, ఘనపూర్

మా గ్రామాల కోసం కొట్లాడుతాం

గ్రామ పంచాయతీ ఉంటే ప్రజలకు పాలన చేరువగా ఉంటుంది. మున్సిపాటీలు, జీహెచ్ఎంసీలో గ్రామాలను కలిపితే సామాన్య ప్రజలకు పాలన దూరం అవుతుంది. పన్నులు పెరిగి పేదలపై భారం పడుతుంది. ఉపాధి హామీ పనులు బంద్ అవుతాయి. పేద, మధ్య తరగతికి ఎలాంటి ఉపయోగం ఉండదు. అందుకే మా గ్రామాల కోసం కొట్లాడుతాం. ఐక్య కార్యచరణను సిద్ధం చేసుకుంటాం.

– చారి, కిష్టారెడ్డిపేట, సంగారెడ్డి జిల్లా

ప్రజాభిప్రాయం లేదు

తెల్లాపూర్ మున్సిపాలిటీలో అధికారులు ముత్తంగి గ్రామాన్ని బలవంతంగా కలిపారు. ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు. ప్రజలందరూ ఒప్పుకున్నారని అధికారులే రాసుకుని విలీనం చేశారు. రేపు తెల్లాపూర్ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో కలుపుతారంట. అప్పుడు ప్రజలకు ట్యాక్స్‌ల భారం పెరుగుతుంది. పేదలు, మధ్య తరగతివారు జీవించడం కష్టతరంగా మారుతుంది.

– అనిల్‌కుమార్, ముత్తంగి, సంగారెడ్డి జిల్లా

సామాన్యులకు పన్నుల మోత

మా గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీనివల్ల సామాన్యులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. మా గ్రామం ఇంకా పల్లె వాతావరణంలోనే ఉంది. గ్రామాన్ని అభివృద్ధి చేసిన తరువాత మున్సిపాలిటీలో కలిపితే బాగుండేది. పన్నుల మోత సామాన్యులకు భారంగా మారనున్నది. ప్రజల ఇష్టం లేకుండా ప్రభుత్వం బలవంతంగా విలీనం చేయడం తగదు.

– పెంటేశ్‌గౌడ్, దాయర గ్రామం, సంగారెడ్డి జిల్లా

తునికికి 25న ఉప రాష్ట్రపతి రాక

తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి , డిసెంబర్14 : మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి గ్రామ శివారులోని గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రానికి ఈనెల 25న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రానున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో శనివారం అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమై ఏర్పాట్లను పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ విధానంలో సాగుచేస్తున్న పంటలను పరిశీలించి, రైతులతో ఉప రాష్ట్రపతి ముఖాముఖీ కానున్నారు. దీనికి సంబంధించి నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. వారివెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఉన్నారు.

మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలి

- రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం
- మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్ల బకాయిలు చెల్లించాలి
- మాజీ సర్పంచ్‌లకు సైతం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, డిసెంబర్ 14: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో పెట్టడంతో విద్యాసంస్థల నుంచి విద్యార్థులకు వేధింపులు ఎదురవుతున్నాయని, వాయిదా పద్ధతుల్లోనైనా వెంటనే చెల్లింపులు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. శనివారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవనంలో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం మీడియాతో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్ల బకాయిలు సైతం పెరిగి పోతున్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని సూచించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ రూ.2లక్షల రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పంట రుణమాఫీలో జరిగిన లోటుపాట్లు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే సరిచేసి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా సాయం ఇచ్చి ప్రభుత్వం పేరు నిలబెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. రైతుభరోసా విధివిధానాల ఖరారు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. మోదీ సర్కారు రాజ్యాంగాన్ని మార్చి, జమిలీ ఎన్నికలకు నిర్వహించాలనే కుట్రలు చేస్తున్నదని, దీనిని తిప్పికొట్టాల్సిన అవరసం ఎంతైనా ఉందన్నారు. అదానీ వ్యవహారంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని వేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కేంద్రం విధానాలపై ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేండ్లు అవుతున్న సందర్భంగా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బెజ్జంకి మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈనెల 19న రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతిస్తామని తెలిపారు. 26న గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, సత్యనారాయణ, వనేశ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా మత్తు పదార్థాలు స్వాధీనం

నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 14: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముగ్గురిని సిద్దిపేట ఎక్సైజ్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. శనివారం పట్టణ శివారు కిష్టసాగర్ రోడ్డులో ఆల్పాజోలం విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈమేరకు గడ్డమీది రాజు గౌడ్ వద్ద 2.5 కిలోల ఆల్పాజోలం మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సుమారు మత్తుపదార్థం విలువ రూ.25 లక్షలు ఉంటుందన్నారు. రాజుగౌడ్‌ను విచారించగా.. అర్జున్ గౌడ్, నర్సింహులు గౌడ్‌లు తనకు ఆల్పాజోలం సరఫరా చేస్తున్నారని ఒప్పుకున్నాడు. వారందరినీ అదుపులోకి తీసుకొని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వారికి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. తనిఖీల్లో సీఐ శ్రీధర్, ఎస్సైలు సరిత, విజయ్, కిరణ్, హెడ్ కానిస్టేబుళ్లు చెన్నగౌడ్, రవీందర్, పోలీసులు స్వామిరెడ్డి, స్వామి, శరత్, చంద్రకార్తీక్, చంద్ర, కార్తీక్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, మౌనిక, కవిత, బాలమణి, మంజుల, స్వాతి తదితరులు ఉన్నారు.

కవులు ప్రజలపక్షం నిలవాలి

సాహితీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 14: కవులు నిరంతరం ప్రజల పక్షం నిలవాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలో వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో మళ్లీ మనిషిలోకి, పురస్కార ప్రదానం, స్వాతిదేవర, స్వాతి చినుకులు, కవితా సంపుటీల ఆవిష్కరణ, కవితా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలనా విధానాల్లో మార్పులు సహజం.. కానీ కవులు వర్తమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజల శ్రేయస్సు కోసం కవిత్వాలు రాయాలని సూచించారు. దశాబ్దకాలంగా వెన్నెల సాహితీ సంగమం ఎందరో కొత్త కవులను ప్రోత్సహిస్తూ సాహితీ ప్రపంచానికి పరిచయం చేయడం గొప్పవిషయమని డాక్టర్ నారాయణ అన్నారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, యాదగిరి, గాలిరెడ్డి, రాంచంద్రారావు, మహిపాల్, మహమూద్ పాషా, అశోక్‌రాజు, స్రవంతి, ఉమాశంకర్, శ్రీధర్, సుధాకర్, బాబు, పెద్దిరాజు, ప్రవీణ్, స్వామి, లక్ష్మి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.